సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



ఫేక్ సర్టిఫికెట్లతోనే రిజిస్ట్రేషన్

వంశపారంపర్యంగా కాపాడుకుంటూ వస్తున్న ఆస్తులను తప్పడు సర్టిఫికెట్లు సృష్టించి అమ్ముకోవడం ప్రొద్దుటూరులో చర్చనీయాంశంగా మారింది. -8లో



చాలీ చాలని జీతాలతో చాకిరి

సమగ్రశిక్ష, విద్యా శాఖలో చిరుద్యోగులైన సీఆర్ఎంటీలు, మండల అకౌంటెంట్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో చాకిరీ చేస్తున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.4/24.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 24.8 – 35.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

17న వేలం

వేంపల్లి: గండి క్షేత్రంలో టెంకాయలు అమ్ముకునే హక్కు పొందేందుకు ఈ నెల 17న సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ జె.వెంకటసుబ్బయ్య, ఆలయ చైర్మన్ కావలికృష్ణతేజ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.10 లక్షల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. విజయవాడ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు.

లోక్ అదాలత్‌లో జిల్లాకు మొదటి ర్యాంక్

కడప అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో వైఎస్సార్ కడప జిల్లాకు మొదటి ర్యాంక్ లభించింది. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 21894 క్రిమినల్ కేసులు, 214 సివిల్ కేసులు, 63 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించారు. కక్షిదారులకు రూ.16,24,85,555 చెల్లించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసు, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తామన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు విన్నవించుకోవచ్చన్నారు.

పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు



ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రెస్‌మీట్‌లో ఒక నాయకుడు మాట్లాడిన అంశాలను పత్రికలో ప్రచురిస్తే సంపాదకునిపై కేసు నమోదు చేయడం ఏమిటి? ఇదికెక్కడి న్యాయం? ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా వ్యవహరిస్తోంది. సాక్షి ఎడిటర్‌గా తన విధ్యుక్త ధర్మాన్ని పాటించిన ధనుంజయరెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం సరికాదు.

– రాచమల్లు శివప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి



ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రశ్నిస్తే కేసులా?




ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛపై గౌరవభావం కలిగి ఉండాలి. రాజ్యాంగం విలువలను కాపాడాల్సిన ప్రభుత్వాలే పత్రికల గొంతు నొక్కడం అన్యాయం. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై వేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– గడికోట మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, లక్కిరెడ్డిపల్లె

యూరియా కొరత.. తీరని వెత

- అన్నదాతను వేధిస్తున్న యూరియా సమస్య
- బస్తా కోసం గంటల తరబడి పడిగాపులు
- 30 శాతం సాగుకే సరఫరా చేయని సర్కారు
- మండిపడుతున్న రైతులు, సంఘాల నేతలు





దువ్వూరులోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు



కౌలు రైతు ఆశీర్వాదాన్ని తోస్తున్న పోలీసులు

కడప అగ్రికల్చర్: జిల్లా రైతాంగాన్ని యూరియా కొరత వేధిస్తోంది. అధికారులు మాత్రం ఎక్కడా కొరత లేదంటూ ప్రకటనలు ఇస్తున్నారు. బస్తా యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, మన గ్రోమోర్ సెంటర్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులన్నీ వదులకుని మండల కేంద్రాల బాట పట్టాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వ్యాపారుల వద్ద బస్తాను రూ.400 పైన పెట్టి కొనాల్సి వస్తోందని అంటున్నారు. ఒకవేళ కొనేందుకు సిద్ధమైనా.. షాపుల యజమానులు తమ వాళ్లకే ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల నేతలే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా సామాన్య రైతులు మాత్రం బస్తా యూరియా దొరకక ఆర్తనాదాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎవరిని కదిపినా..

జిల్లాలో ఏ మండలంలో రైతును కదిపినా.. కొందామంటే యూరియా లేదనే మాటే వినిపిస్తోంది. ఎన్నడూ లేని విధంగా పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ చేస్తున్నారంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయ అధికారులు పంపిణీ చేసిన టోకెన్లు పొందిన రైతులకు కూడా అందడం లేదు. 'అయిన వారికి అరిటాకులో కాని వారికి కంచాల్లో వడ్డించారు' అనే సామెత మాదిరిగా.. యూరియా పంపిణీ జరుగుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్క సొసైటీ, రైతు సేవా కేంద్రాల వద్ద గంటల తరబడి నిలుచున్నా.. రెండు బస్తాల యూరియా దొరకక ఉసూరుమంటూ వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితిపై రైతులు, రైతు సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వంద శాతం పంటలు సాగైతే పరిస్థితి ఏంటీ?

ఈ ఏడాది జూన్, జూలైలో సరైన వర్షాలు లేక ఖరీఫ్ సీజన్ అనుకున్న మేర సాగు కాలేదు. జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు 77551 హెక్టార్లకు గాను 26835 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే 35 శాతం మేర మాత్రమే సాగయ్యాయి. అదే వంద శాతం పంటలు సాగై ఉంటే.. మరి పరిస్థితి ఎలా ఉండేది అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వరి సాధారణ సాగు 39894 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 14926 హెక్టార్లు మాత్రమే సాగైంది. అంటే వరి పంట కూడా కేసీ కెనాల్, ప్రాజెక్టులు, నది పరీవాహక ప్రాంతాలన్ని కలిపి 50 శాతంలోపే సాగైంది. వరి కూడా వంద శాతం సాగై ఉంటే యూరియా భారీ కొరత ఏర్పడేది. పూలు, జొన్న, మొక్కజొన్న, పత్తి, అరటి, సన్‌ఫ్లవర్, రాగి, కొర్ర పంటలకు కూడా యూరియా అవసరం ఉంటుంది. ఈ పంటల సాగు 20 శాతం మించి సాగు కాలేదు. అన్ని పంటల సాగు తక్కువగా ఉండటం వల్లే ఒక రకంగా యూరియా కొరత నుంచి ఉపశమనం దొరికింది. వరితోపాటు అన్ని పంటలు వంద శాతం సాగై ఉంటే.. మరింతగా యూరియా కొరత వేధించి ఉండేదని పలువురు రైతులు అంటున్నారు.

వరి దిగుబడి నాటికి మూడు సార్లు

సాధారణంగా వరి సాగు చేసిన రైతులు వరి నాటిని 25 రోజులకు ఒకసారి, 50 రోజులకు ఒకసారి మరో సారి ఒక సారి యూరియా వేస్తారు. వీటితోపాటు ఆరుతడి పంటలకు కూడా రెండు, మూడు సార్లు వేస్తారు. అయితే యూరియా దొరకక పోవడంతో ముస్ముందు దొరకదేమోననే భయంతో.. కొందరు ఎక్కువగా తీసుకెళ్తున్నారు. ఒకరకంగా ఇది కూడా కొరతకు కారణంగా చెప్పవచ్చు. గతంలో ఎప్పుడు యూరియా అవసరం ఉంటే అప్పుడే రైతులు షాపులు, రైతు సేవా కేంద్రాలకు వచ్చి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం యూరియా కొరత ఉండటంతో అందరూ ఒక్కసారిగా ఎగబడటంతో.. పరిస్థితి ఇలా ఉంటోంది.



నా పేరు మహబూబ్ బాషా. మాది దువ్వూరు. నాకు 5 ఎకరాలు పొలం ఉంది. అంతా వరి పంట సాగు చేశాను. దువ్వూరులో ఈ వారంలో 2 పర్యాయాలు యూరియా పంచారు. మొదటి సారి 5 గంటలు క్యూలో నిలబడితే ఒక బస్తా కూడా దొరకలేదు. రెండవ సారి మాత్రం 2 బస్తాలు దొరికింది. అయ్యా ఇంకో 2 బస్తాలన్న ఇవ్వండి అంటే నువ్వు ఎక్కువ మాట్లాడితే ఇది కూడా ఇవ్వమని, ఇచ్చింది తీసుకొని పో అన్నారు. నాకు 5 బస్తాల కంటే ఎక్కువ కావాలి. యూరియా ఉన్నా అధికారుల అండదండలు చూసుకొని కొన్ని ఫర్టిలైజర్ దుకాణాల వారు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బస్తా 500 వరకు బ్లాక్‌లో అమ్ముతున్నారు.



నా పేరు మంచాల లక్ష్మీదేవి. మాది దువ్వూరులోని కొత్త కొట్టాల వీధి. మాకు 2.50 ఎకరాల భూమి ఉంది. దువ్వూరు బైపాస్‌లో ఉన్న రైతు సేవ కేంద్రం వద్దకు యూరియా కోసం ఉదయం 6 గంటలకు వచ్చాం. 5 గంటలు క్యూలో నిలబడితే 2 బస్తాల యూరియా ఇచ్చారు. సార్ ఇంకో రెండు బస్తాలు ఇవ్వండి అని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. కానీ వాళ్లకు నచ్చిన వారికీ ఎన్ని బస్తాలు అడిగితే అన్ని ఇస్తున్నారు. ఇది చాలా అన్యాయం.

ఈ సమస్య వీరిదే కాదు.. జిల్లాలోని రైతులందరూ దాదాపు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.



నా పేరు ఆశీర్వాదం. మాది దువ్వూరు ఎస్సీ కాలనీ. నేను కౌలుకు 7 ఎకరాల పొలం తీసుకున్నాను. వరి, మొక్కజొన్న, పసుపు పంటలు సాగు చేశాను. అయ్యా నాకు యూరియా చాలా అవసరం ఉంది. ఎన్ని సార్లు వచ్చినా ఒక బస్తా కూడా అందలేదు. 3 బస్తాలు ఇవ్వండి అని ప్రాథేయపడినా అధికారులు కనికరించలేదు. పైగా నేను చాలా ఇబ్బంది చేస్తున్నానని వ్యవసాయ సిబ్బంది చెప్పడంతో.. పోలీసులు నన్ను అక్కడి నుంచి దొబ్బేశారు. సార్ నేను గొడవ పడటం లేదు.. నా బాధ వ్యవసాయ అధికారులకు చెప్పుకొంటున్నాను.. మీరు ఎందుకు గెంటి వేస్తున్నారు అన్నా కూడా పోలీసులు బలవంతంగా పంపించి వేశారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసిన దానికన్నా.. వినియోగం ఎక్కువగా ఉందని సమాచారం. ఇదే సమయంలో కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ఎక్కువ ధరకు కొందరు ప్రైవేటు వ్యాపారులు అమ్ముతున్నారు. ఒక బస్తాకు రూ.330 నుంచి 450 వరకు చెల్లించి బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఏదిఏమైనా ఈ పరిస్థితిని అధిగమించేందుకు అధికారులు మరింత దృష్టి సారించాల్సి అవసరం ఎంతైనా ఉంది.



చాటింపు వేయాలి



గ్రామీణ ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాలకు యూరియా వచ్చినప్పుడు అధికారులు చాటింపు వేయాలి, కానీ అలా చేయడం లేదు. రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియాను ఆ గ్రామ నాయకులు.. తమకు తమ వాళ్లకు ఇప్పించుకుంటున్నారు. మిగతాది బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అధికారులు పర్యవేక్షించాలి.

– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

ఆందోళన చెందవద్దు



రైతులెవరూ యూరియా కోసం ఆందోళన చెందవద్దు. ఖరీఫ్ సీజన్‌కు గాను 20,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 16 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేశాం. మళ్లీ 950 మెట్రిక్ టన్నులు రానుంది. రైతులు కూడా అవసరం మేరకే యూరియా తీసుకెళ్లాలి. దొరకదేమోనని ఎక్కువ తీసుకుంటున్నారు. అలా చేయవద్దు. రబీ సీజన్‌కు కూడా యూరియా వస్తుంది. ఖరీఫ్ సీజన్‌కు రావాల్సిన బ్యాలెన్స్ యూరియా కూడా వస్తుంది.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉద్యమం

- విద్య, వైద్యం పేదలకు దూరం చేస్తే ఊరుకోం
- కార్పొరేట్ వ్యక్తులకు కూటమి దోచిపెట్టే యత్నం
- సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు వైఎస్ఆర్ పేరు తొలగింపుపై ఆగ్రహం
- రిమ్స్‌ను పరిశీలించిన వైఎస్ఆర్‌సీపీ నేతలు



కడప రిమ్స్ ఆవరణలో ఆందోళన చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు

కడప అర్బన్: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే.. ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని వైఎస్ఆర్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. కడప నగర శివారులో 2006లో 230 ఎకరాల్లో రిమ్స్‌ను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి రాగానే 125 కోట్ల రూపాయలతో 452 పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, 40.81 కోట్ల వ్యయంతో 100 పడకల సామర్థ్యంతో మానసిక వైద్యశాల, 107 కోట్ల రూపాయల వ్యయంతో 100 పడకల కేన్సర్ హాస్పిటల్‌కు 2019 డిసెంబర్ 23న శంకుస్థాపన చేశారు. ఈ మూడు హాస్పిటల్స్ నిర్మాణాలను పూర్తి చేసి 2023 డిసెంబర్ 23న ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చారు. అలాగే పులివెందులలో మెడికల్ కళాశాల, అనుబంధంగా ఆసుపత్రి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్ పాలనలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఈ నేపథ్యంలో కడప రిమ్స్‌ను వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబుతోపాటు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పరిశీలించారు. అనంతరం అక్కడ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మీడియా బృందంతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన 16 నెలలకే మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమయ్యారని, అలా చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఆ పార్టీ నేతలు సులి సునీల్‌కుమార్, షేక్ షఫీ, కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామిరెడ్డితోపాటు పలువురు నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాలను కూటమి అమ్మేందుకు తెరలేపింది



సీమ నడిబొడ్డున ఉన్న కడప సూపర్ స్పెషలిటీ వైద్యశాలను సైతం అమ్ముకునే, దోచుకునే కార్యక్రమానికి పాల్పడటం సిగ్గు చేటు. అప్పట్లో ఎయిమ్స్ కూడా ప్రైవేట్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలా కాకుండా బిల్డింగ్‌లు నిర్మించి, వాడుకలోకి తీసురావాలని భావించారు. నిజాన్ని అబద్ధం చేయాలనుకోవడం సరికాదు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు. త్వరలో బుద్ధి చెబుతారు.

– పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ


వైఎస్ఆర్ పేరు తొలగింపు సరికాదు



ఉమ్మడి రాష్ట్రంలో 10 మెడికల్ కళాశాలలు కట్టించి, వైద్య సేవలు అందించిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిదే. నాలుగు జిల్లాలకు నడిబొడ్డున రిమ్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం రిమ్స్‌ను అప్‌గ్రేడ్ చేసి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మించారు. మెరుగైన వైద్యం అందించాలని సంకల్పించి జగన్ జాతికి అంకితం చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు తీసేయడం సిగ్గు చేటు. దుర్మార్గపు ఆలోచన విరమించుకోవాలి.

-కె.సురేష్‌బాబు, నగర మేయర్, కడప

ప్రజలను మభ్య పెడుతోంది



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 17 కొత్త మెడికల్ కాలేజీలు తెచ్చారు. పాడేరు, పులివెందుల మెడికల్ కళాశాలలు పూర్తి అయినా వినియోగంలోకి తీసుకురాదు. కేంద్ర ప్రభుత్వం సీట్లు కేటాయించినా వద్దని వెనక్కి పంపారు. ఆ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నారు. పీపీపీ పద్ధతిలో ఉన్నా ప్రభుత్వ ఆస్తే.. అయితే ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తారని చెప్పడం ప్రజలను మభ్య పెట్టడమే. నారాయణ, చైతన్య విద్యా సంస్థలకు దోచిపెట్టే కుట్రలో భాగమే ఇది.

– ఎస్‌బీ అంజద్‌బాషా, మాజీ డిప్యూటీ సీఎం

పేదలకు వైద్య విద్య దూరం



మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే.. పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. కాలేజీలను అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు కూడా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో.. ఉచిత వైద్య సౌకర్యం పేదలు కోల్పోతారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలలను నిర్మింపచేసి అభివృద్ధి దిశగా తీసుకుని వెళ్లారు. కానీ చంద్రబాబు వాటిని ప్రైవేటు పరం చేయాలనుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– డాక్టర్ నాగార్జున రెడ్డి, డాక్టర్ల విభాగం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ

కడప టు బీహార్!

- డైరెక్ట్ కనెక్టివిటీకి లైన్‌క్లియర్
- ఉమ్మడి కడప జిల్లా లైన్‌లో రక్సౌల్–చర్లపల్లె వీక్లీ
- 20 నుంచి తిరుపతి వరకు పొడిగింపు



రాజంపేట: ఉమ్మడి కడప జిల్లా వాసులకు గుడ్‌న్యూస్. ఎందుకంటే ఇప్పటి వరకు బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాలకు డైరెక్ట్ కనెకివిటీ రైలు ఉమ్మడి కడపజిల్లా రైలుమార్గంలో నడవలేదు. బీహార్‌లోని రక్సౌల్ నుంచి చర్లపల్లి (తెలంగాణ) వరకు ఆరేళ్లుగా రైలు నడుస్తోంది. ఇప్పుడు ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను జిల్లా రైలుమార్గంలో తిరుపతి వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు డైరెక్ట్ కనెక్టివిటీకి లైన్ క్లియర్ కావడంతో ఉమ్మడి కడప జిల్లా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి ఈ రైలు నేరుగా బీహార్ నుంచి చర్లపల్లి మీదుగా జిల్లా రైలు మార్గం గుండా తిరుపతికి చేరనుంది.

ఇప్పటి వరకు గూడూరు జంక్షన్ నుంచి

ఉమ్మడి కడప జిల్లా వాసులు బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు వెళ్లాలంటే కష్టాలు పడేవారు. రేణిగుంట–విజయవాడ మార్గంలోని గూడూరు జంక్షన్‌కు వెళ్లి తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉండేవి. ఈ జంక్షన్ ఉమ్మడి కడప జిల్లా వాసులకు చాలా దూరం. కడప నుంచి గూడూరుకు 141 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి ఉంటుంది. దాదాపు మూడు గంటలకు పైగా సమయం పడుతుంది. ఏ రైలుకు వెళ్లాలన్న గూడూరు జంక్షన్‌కు 4 గంటల ముందే చేరుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రయాణికులకు ఇక్కట్ల ప్రయాణం తప్పడం లేదు.

- 07052/51 నంబరుతో నడిచే రైలును రక్సౌల్(బీహార్) నుంచి తిరుపతి, తిరుపతి నుంచి రక్సౌల్‌కు పొడిగించారు. గుంతకల్, రాయచూరు, వికారాబాద్, సికింద్రాబాద్ మీదుగా వీక్లీ ప్రత్యేక రైలును నడపనున్నారు.
- ఝార్ఖండ్ రాష్ట్రంలోని ప్రముఖ జ్యోతిర్లింగమైన బైద్యనాథ స్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి కడప జిల్లావాసులకు వీలు కలుగుతుంది.
- బీహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని ధన్‌బాద్, రాంచీ, జాసిద్, ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్ పట్టణాలకు మార్గం సుగమమం కానుంది.
- ఉత్తర తెలంగాణతో ఉమ్మడి కడప జిల్లా వాసులు అనుసంధానంగా ఈ రైలును నడవనుంది. దీంతో మంచిర్యాల, పెద్దపల్లి, ఖాజీపేట, తర్పూర్‌కాగజ్ నగర్‌లకు చేరుకోవచ్చు.

రైలు టైమింగ్స్

కడప రైలుమార్గంలో నడిచే బీహార్ వీక్లి ఎక్స్‌ప్రెస్ రైలు టైమింగ్స్ ఇలా ఉన్నాయి. తిరుపతిలో గురువారం ఉదయం 8.15 గంటలకు బయలుదేరుతుంది. రాజంపేటకు 9.34, కడపకు 10.23,ఎర్రగుంట్లకు 10.59, తాడిపత్రి 11.54 గంటలకు చేరుకుంటుంది. గుంతకల్‌కు 1.20కి వెళుతుంది. రక్సౌల్ జంక్షన్‌కు చేరుకునేందుకు మూడు రోజులు పడుతుంది. రక్సౌల్‌కు 50 కిలోమీటర్ల దూరంలో నేపాల్ దేశ సరిహద్దు ఉంటుంది. ఈ రైలును రెగ్యులర్‌గా నడిపించాలని ఇతర రాష్ట్రాల వారు డిమాండ్ చేస్తున్నారు.

బీహార్ రైలును రెగ్యులర్‌గా నడిపించాలి



బీహార్‌రైలును రెగ్యులర్‌గా నడిపించేలా రైల్వే బోర్డు, రైల్వేమంత్రిత్వశాఖ దృష్టి సారించాలి. ఉమ్మడి కడప జిల్లాలో అనేక మంది వలస కార్మికులు, ఉద్యోగులు, రైల్వేకార్మికులు ఉన్నారు. వీరందరికీ ఈ రైలు ఎంతగానో ఉపయోగపడుతుంది.యాత్రీకులకు కూడా సౌకర్యంగా ఉంటుంది.

–మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

క్లుప్తంగా

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య


మృతి చెందిన గంగమ్మ

ఎర్రగుంట్ల : మండలంలోని పెద్దనపాడు గ్రామానికి చెందిని చిలంకూరు గంగమ్మ (25) ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని యర్రగుంట్ల పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెద్దనపాడుకు చెందిన వీరాంజనేయులు, లక్ష్మీదేవి కుమార్తె గంగమ్మ. గంగమ్మకు పెళ్లి చూపులు చూస్తున్నా.. అవి కుదరడం లేదు. దీంతో గంగమ్మ తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మీదేవి అనుమానంతో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వంకలోపడి ఎనిమిదేళ్ల బాలుడు మృతి


వంకలో పడి మృతి చెందిన పి. గుణదీపక్

కొండాపురం : అప్పటి వరకు కళ్ల ముందు నవ్వుతూ ఆటలాడుతున్న కొడుకు క్షణాల్లో విగతజీవిగా మారడం ఆ తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చింది. మండలంలోని దత్తాపురం పునరావాస కేంద్రంలోని వంకలో పడి ఎనిమిదేళ్ల బాలుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దత్తాపురం గ్రామానికి చెందిన పాపన్నగారి గుణదీపక్(8) మూడో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం సమయంలో పిల్లలతో కలిసి సరదగా వినాయకుని విగ్రహం తయారు చేసుకోవడానికి బంకమట్టికోసం వంక దగ్గర తీసే సమయంలో ప్రమాదవశాత్తూ అందులో పడిపోయాడు. కుటుంబీకులు గుర్తించేలోగానే బాలుడు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. తల్లిదండ్రులు గంగాధర్, గీతలు గుండెలవిసేలా ఏడ్చారు. బాలుడు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులురి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జి కారొనేషన్ క్లబ్‌లో ఉమ్మడి కడప జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–19 బాలబాలికల రైఫిల్ షూటింగ్, ఫెన్సింగ్, టేబుల్ టెన్నిస్ జిల్లా స్థాయి ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. క్రీడాకారులు తమ నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను ఈనెల 23 నుంచి 26 వరకు కాకినాడ, రాజమండ్రిలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఫెన్సింగ్ పోటీలకు 28 మంది క్రీడాకారులు పాల్గొనగా 14 మంది, రైఫిల్ షూటింగ్‌లో 16 మంది పాల్గొనగా 9 మంది, టేబుల్ టెన్నిస్‌లో 17 మందికి గాను 10 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలను జార్జికారొనేషన్ క్లబ్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–19 జిల్లా సెక్రటరీ చంద్రమోహన్ రాజు, కోచ్ రాఘవ, అల్లా బకాష్, శివారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

చాలీ చాలని జీతాలతో చాకిరి

- ఏళ్లతరబడి పనిచేస్తున్నా కనికరించని ప్రభుత్వం
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం మరిచిన ప్రభుత్వం
- ఆరేళ్లుగా వేతనం పెంపుకోసం ఎదురుచూపు


పిల్లలలకు పాఠాలను బోధిస్తున్న సీఆర్ఎంటీఎస్ (ఫైల్)

జిల్లాలో పనిచేస్తున్న సీఆర్ఎంటీఎస్‌లు	156
మండల లెవల్ అకౌంటెంట్లు	19
ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు	34
డేటా ఎంట్రీ ఆపరేటర్లు	35

కడప ఎడ్యుకేషన్ : సమగ్రశిక్ష, విద్యా శాఖలో అత్యంత కీలకంగా పనిచేసే చిరుద్యోగులైన సీఆర్ఎంటీ(క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్స్)లు, మండల లెవల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో చాకిరీ చేస్తూ కుటుంబాలను భారంగా మోస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరకులు, ఇంటి అద్దెలు, ఖర్చులతో దిక్కుతోచని పరిస్థితిలో అల్లాడిపోతున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఏ ప్రభుత్వం కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ చాలీచాలని జీతాలతో జీవితాలను ఏ విధంగా సాగించాలని మదిలో మదనపడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్న సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించకుండా, ఉద్యోగుల మధ్య వేతన అసమానతలను పెంచే విధంగా ఈ జీవో నంబర్–2ను అమలు చేస్తోంది. ఈ జీఓ కేవలం ఉద్యోగుల ఆర్థిక భద్రతను దెబ్బతీయడమేగాక, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందని విద్యాశాఖలో పనిచేసే పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా విద్యా శాఖలో..

జిల్లా వ్యాప్తంగా మండల వనరుల కేంద్రంలో 156 మంది సీఆర్ఎంటీలు, 19 మంది మండల లెవల్ అకౌంటెంట్స్, 34 మంది ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, 35 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరంతా 2012లో ఉద్యోగాల్లో చేరారు. అప్పట్లో వీరికి నెలకు రూ.18,500 ఉండేది. ఆ తర్వాత వీరికి 2020లో గత వైసీపీలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 23,500కు వేతనం పెంచింది. ఆ తరువాత అధికారంలోకి కూటమి ప్రభుత్వం వారి గురించి పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపచేయరాదని, 2025 జనవరి, 6వతేదీన జీవో నంబర్–2 విడుదల చేసింది. ప్రభుత్వ శాఖలలో మంజూరైన ఖాళీ పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే అర్హులని తేల్చింది. ఈ జీవో రాజ్యాంగ కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమని, కృత్రిమ ప్రాతిపదికలు సృష్టించి శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా ఉండడమే ఈ జీఓ ఉద్దేశమని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే, ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు లేకపోవడం బాధాకరమని. ప్రభుత్వం ఆదర్శ యజమానిగా వ్యవహరించి, ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని కోరుతున్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి..

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలుచేస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినప్పటికీ ఈ ఏడాది కాలంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. ఇటీవల ఎన్టీఆర్ భరోసా పెన్షన్, నూతన రేషన్ కార్డులు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేసినప్పటికీ చిరుద్యోగులకు వర్తింపచేయలేదని వారు తెలిపారు. నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దె విపరీతంగా పెరగడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు సరిపోవడంలేదని వాపోతున్నారు. నెలవారీ ఖర్చుల కోసం అప్పుచేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, ఇంటి అద్దె భృతి, రేషన్ సబ్సిడీ పథకాలను ప్రత్యేకంగా అమలుచేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగుల వేతనాలను విరివిగా పెంచే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం వికలాంగులు, ఒంటరి మహిళ పెన్షన్, కుటుంబ సభ్యులకు వద్ధాప్యం పింఛన్ తొలగించారు. వాటిని తిరిగి పునరుద్ధరించి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తోడ్పాటు ఇవ్వాలని కోరుతున్నారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తించాలి

తెలుగుదేశం ప్రభుత్వం రిటైర్‌మెంట్ వయస్సు 58 నుండి 60 ఏళ్లకు పెంచింది. తదనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులకు 62 ఏళ్లకు పెంచింది. కానీ ఈ సౌకర్యం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తించలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అంగన్వాడీ, ఆశా వర్కర్లకు గ్రాట్యూటీ అమలు చేస్తూ, రిటైర్‌మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచినా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం వర్తింప యకపోవడం వారికి నిరాశ కలిగిస్తోంది. అనేక సంవత్సరాలుగా తక్కువ జీతంతో పనిచేస్తూ, ఎలాంటి పదవీ విరమణ ప్రయోజనాలు లేకుండా, రిటైర్ అయ్యేసరికి కుటుంబానికి భారం అవుతున్న పరిస్థితి దురదృష్టకరమని ఆందోళన చెందుతున్నారు. వీరికి కూడా రెగ్యులర్ ఉద్యోగుల్లానే రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలు, గ్రాట్యూటీ, పెన్షన్ పథకం లేదా ఉద్యోగ భద్రతకు దారిచూపే ప్రయోజనాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

నాపై పోలీసులు దాడి చేశారు


చికిత్స పొందుతున్న బాధితుడు సాంబశివ

కడప అర్బన్ : హోటల్‌లో భోజనం చేస్తుండగా మైదుకూరు పోలీసులు తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని మైదుకూరు మండలం జీవీ.సత్రానికి చెందిన కాకాని సాంబశివ ఆరోపించారు. ఈనెల 13వ తేదీన సాయంత్రం తమ గ్రామానికి సమీపంలో భోజనం చేస్తున్నాననే గానీ, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడలేదని చెబుతున్నా లాఠీలతో చితకబాదారని తెలిపారు. ప్రస్తుతం రిమ్స్‌లో గాయాలతో చికిత్స పొందుతున్నానని, తనకు న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

కడపలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు


ఆకస్మిక తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్, అప్సర సర్కిళ్లలో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలు, ఆర్టీసీ బస్టాండ్‌లో సోదాలు జరిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా వాహనాలను నడిపేటపుడు నిబంధనలను పాటించాలన్నారు. లాడ్జీలలో గదులను అద్దెకు ఇచ్చేటపుడు గుర్తింపుకార్డును తీసుకోవాలని సూచించారు.

వైద్యులు చేతులెత్తేస్తే..
108 సిబ్బంది పురుడు పోశారు


108 వాహనంలో ప్రసవించిన బిడ్డను తల్లికి అందిస్తున్న ఈఎన్‌టీ రెడ్డి జశ్వంత్

మదనపల్లె రూరల్ : జిల్లా ఆస్పత్రికి ప్రసవ వేదనతో వచ్చిన ఓ మహిళకు.. తాము కాన్పు చేయలేమని వైద్యులు చేతులెత్తేశారు. గర్భిణిని తిరుపతికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్ వద్ద 108 వాహనంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. జిల్లా ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కనపరిస్తే.. 108 సిబ్బంది పురుడుపోశారని మహిళ కుటుంబీకులు చేతులెత్తి దండం పెట్టారు. వివరాల మేరకు..

నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీ కత్తిరివారిపల్లెకు చెందిన సాగర్ భార్య భాగ్యమ్మ(20) రెండో కాన్పు నిమిత్తం పుట్టినిల్లు మదనపల్లె మండలం బసినికొండలో ఉంటోంది. శనివారం అర్ధరాత్రి తర్వాత ఆమెకు పురిటినొప్పులు మొదలవడంతో 108 వాహనం బసినికొండకు చేరుకుని భాగ్యమ్మను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తెచ్చారు. వార్డులోకి తీసుకెళ్లేందుకు వీల్ చైర్ లేకపోవడంతో కుటుంబసభ్యులు నొప్పులు పడుతున్న మహిళను నడిపించుకునే తీసుకెళ్లారు. ఆ సమయానికి డాక్టర్ అందుబాటులో లేకపోవడం, నర్సింగ్ సిబ్బంది నామమాత్రపు పరీక్షలు చేసి తిరుపతికి వెళ్లాలంటూ రెఫర్ చేశారు. ఆస్పత్రికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎన్‌టీ రెడ్డి జశ్వంత్, పైలట్ సద్దాం గర్భిణి ప్రసవవేదనను గమనించి, ఈ స్థితిలో తిరుపతికి తరలిస్తే మార్గమధ్యంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ఆస్పత్రిలోనే కాన్పు చేయండంటూ అభ్యర్థించారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా చికిత్స గురించి మీరు చెప్పేదేంటి. ఆమెకు రక్తం ఆరు పాయింట్లు ఉంది. మేం రెఫర్ చేస్తే తీసుకెళ్లడం మీ బాధ్యత. తీసుకువెళ్లండంటూ గదమాయించారు. చేసేదేమీలేక 108 సిబ్బంది భాగ్యమ్మను తిరుపతికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో భాకరపేట ఘాట్ సమీపంలో 108 వాహనంలోనే 3.5 కిలోల బరువున్న మగపిల్లవాడికి జన్మనిచ్చింది. 108 సిబ్బంది ప్రసవానంతర చికిత్సలు అందించి, మరింత మెరుగైన చికిత్స కోసం తిరుపతి మెటర్నరీ ఆస్పత్రిలో చేర్పించారు.

108 సిబ్బంది లేకుంటే మా పరిస్థితి ఏమయ్యేది..



108 సిబ్బంది లేకుంటే, నా భార్య, బిడ్డ నాకు దక్కని పరిస్థితి. సమయానికి దేవుడిలా ఆదుకున్నారు. పురిటినొప్పులతో భార్య తల్లడిల్లిపోతోంది. ఇక్కడే డెలివరీ చేయండని వేడుకున్నా.. ఆస్పత్రి సిబ్బంది, రేపు సాయంత్రం వరకు కాన్పు జరిగే అవకాశం లేదు. తిరుపతికి వెళ్లండని పంపేశారు. సమయానికి 108 వాహనం అందుబాటులో ఉండి, అందులో వెళ్లాం కాబట్టి సరిపోయింది. అదే వైద్యుల మాట విని బస్సులో వెళ్లి ఉండి ఉంటే, మా పరిస్థితి ఏమయ్యేది. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు ఏమాత్రం బాగోలేవు.

– సాగర్, గర్భిణి భర్త

యువతిని మోసగించిన కేసులో వ్యక్తికి రిమాండ్

కలికిరి : యువతిని మోసగించిన కేసులో కలికిరికి చెందిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంసీఏ(ఉన్నతవిద్య) చదువుతున్న యువతిని కలికిరి పట్టణానికి చెందిన పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ ప్రేమ పేరుతో వెంటబడి వంచించాడు. అనంతరం యువతితో వున్న ఫొటోలను ఆమె బంధువులు, స్నేహితులకు పంపి బ్లాక్ మెయిల్ చేయడంతో ఆమె కలికిరికి చేరుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సీఐ అనీల్‌కుమార్ నిందితుడిని శనివారం సాయంత్రం వాల్మీకిపురం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిందితుడిని రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్ట్

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బిజ్జవారిపల్లి క్రాస్ వద్ద ఆదివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నీలకంఠ, సీఐ తులసీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఐదుగురు 2.700 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. రాకేష్, హరి, సుమన్‌లను అరెస్ట్ చేసి ఆటో, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. మరో ఇరువురు పరారీలో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. అరెస్ట్ చేసినవారిని కోర్టులో హాజరు పరిచారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కేవీపల్లె : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని దిగవగల్ల గంటావారిపల్లెలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గంటావారిపల్లెకు చెందిన అనసూయమ్మ ఇంటిలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు పీలేరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలు అదుపుచేశారు. అప్పటికే ఇంటిలోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. విలువైన వస్తువులు, ఆస్తి పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు బాధితురాలు తెలిపారు.

ఫేక్ సర్టిఫికెట్లతోనే రిజిస్ట్రేషన్

కోట్ల రూపాయల ఆస్తులకు కన్నం


ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రొద్దుటూరు : వంశపారంపర్యంగా కాపాడుకుంటూ వస్తున్న ఆస్తులను తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి అమ్ముకోవడం ప్రొద్దుటూరులో చర్చనీయాంశంగా మారింది. ఒకరి ఆస్తి మరొకరికి మారాలంటే ఎన్నో రకాల నిబంధనలున్నాయి. అయితే అన్నింటినీ సులువుగా తయారు చేసి నకిలీ ముఠా కోట్ల రూపాయల ఆస్తులకు కన్నం వేస్తోంది. తాజాగా ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన గంజికుంట సుబ్బరాయుడు ఆస్తే ఇందుకు ఉదాహరణ. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఆయనకు 1986లో మైదుకూరు రోడ్డులోని ఎన్జీఓ ప్లాట్లలో ప్లాట్ నంబర్ 300ను కేటాయించారు. అప్పటినుంచి ఇప్పటి వరకూ ఆయన తన ఆస్తిని కాపాడుకుంటూ వస్తున్నారు. తరచూ తన ప్లాట్ వద్దకు వెళ్లి చూసుకోవడం జరుగుతోంది. చుట్టుపక్కల వారు చెప్పడంతోనే ప్రస్తుతం తన ఆస్తిని మరొకరికి దొంగగా రిజిస్ట్రార్ చేయించారని బయటపడింది.

ఫేక్ సర్టిఫికెట్ల ముఠా ఉందా..

గంజికుంట సుబ్బరాయుడుతోపాటు ఆయన సతీమణి లక్ష్మీదేవి మరణించినట్లు డెత్ సర్టిఫికెట్లు సృష్టించడం హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి సుమారు రూ.2 కోట్ల విలువైన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది. సజీవంగా ఉన్న సుబ్బరాయుడుతో పాటు ఆయన సతీమణి రిజిస్ట్రేషన్‌లో డెత్ సర్టిఫికెట్లు సమర్పించారు. అయితే ఈ డెత్ సర్టిఫికెట్లు మున్సిపాలిటీ నుంచి జారీ చేయలేదు. కేవలం సొంతంగా ఫేక్ డెత్ సర్టిఫికెట్లను తయారుచేసి అమ్మడం జరిగింది. ఈ సర్టిఫికెట్లలో సూచించిన 2015, 2017 సంవత్సరాలలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఉన్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అప్పట్లో రఘునాథరెడ్డి లేరు. 2024 సాధారణ ఎన్నికల సమయంలో రఘునాథరెడ్డి బదిలీపై వచ్చి వెళ్లారు. కాగా ప్రతి ఎన్జీఓ ప్లాట్‌కు సంబంధించి ప్రొద్దుటూరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ నుంచి లేఖను జారీ చేసిన తర్వాతే ప్లాట్‌ను అమ్ముతున్నారు. ఈ ప్లాట్ అమ్మకానికి సంబంధించి కూడా ఆగస్టు నెల 8న సంఘం కార్యదర్శి సాల్మన్ లేఖ ఇచ్చినట్లు పొందుపరిచారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ఫేక్ సర్టిఫికెట్ల ముఠా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. గతంలో కూడా పలు సందర్భాల్లో ఇలాంటి నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగాయి.

కనకదాస విగ్రహావిష్కరణను బహిష్కరిస్తున్నాం

రాయచోటి : తిరుపతి పట్టణంలో రాష్ట్ర మంత్రి సవిత చౌదరి ఆధ్వర్యంలో అక్టోబర్ 5న జరిగే కనకదాస విగ్రహావిష్కరణను బహిష్కరిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా కురబ సంఘం సభ్యులు, నాయకులు ప్రకటించారు. రాయచోటిలోని అజయ్ కల్యాణ మండపంలో కురబసంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర కురవ, కురబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న మంత్రివర్గ విస్తరణలో కురబ కులం పేరు చెప్పుకుంటూ తన భర్త వెంకటేశ్వరచైదరిని పదవిని కాపాడుకునే ప్రయత్నం మంత్రి సవిత చేయడాన్ని తాము ఒప్పుకోమన్నారు. కురబలు సహకరించకపోతే సంఘం నాయకులనే మార్చేస్తామని హెచ్చరించడం తగదన్నారు. అధికారంకోసం ప్రగల్బాలు పలుకుతూ మంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహావిష్కరణను బహిష్కరించాలని కురబ సంఘం ఏకపక్షంగా తీర్మానించిందన్నారు. అలాగే అక్టోబర్ 12న విజయవాడలో నిర్వహించనున్న సమావేశంలో కురబలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెపర్డ్ జిల్లా కురమ, కురబ, కురవ అధ్యక్షుడు, కె.రవిశంకర్, జిల్లా కురవ సంఘం అధ్యక్షుడు తరిగొండఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కప్పల రాజన్న, జిల్లా కోశాధికారి గోవిందు సుధాకర్, గుడి రామానుజులు, గుడిశ్రీనివాసులు, గౌనుపల్లి రెడ్డన్న, మంగిరి రమణ, బోనే మురళీ కుమార్, మంగిరి సురేష్, గుడి శివ, రవీంద్ర పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

జమ్మలమడుగు రూరల్ : కారు ఢీకొన్న సంఘటనలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు కుడి కాలుకు తీవ్రగాయాలైన సంఘటన జమ్మలమడుగు పట్టణంలో చోటు చేసుకొంది. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ముద్దనూరు రహదారిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద బైక్ యూ టర్న్ తీసుకుంటుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో ఆయన కుడి కాలుకు తీవ్రగాయమైంది. స్థానికులు, బంధువులు ఆటోలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు గజ్జల లక్ష్మయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితర నాయకులు వచ్చి బాధితుడుని పరామర్శించారు.

జేఎన్టీయూ వాచ్‌మెన్ మృతి


హరినాథ్ మృతదేహం

కలికిరి : రోడ్డు ప్రమాదంలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న వాచ్‌మెన్ హరినాథ్(47) మృతిచెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తిమ్మారెడ్డిగారిపల్లికి చెందిన హరినాథ్ జేఎన్టీయూ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం కళాశాల నుంచి సొంత పని నిమిత్తం స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గ మధ్యంలో చింతలవారిపల్లి బస్టాపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో హరినాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆటోలో కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుల్లంపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పుల్లంపేట శ్రీరాములుపేటకు చెరందిన శివ, మణి ద్విచక్ర వాహనంలో చిట్వేలి నుంచి తమ గ్రామానికి వెళ్తున్నారు. దిగువపల్లి సమీపాన రోడ్డు ప్రక్కన ఉన్న కంచెను ఢీకొని కింద పడ్డారు. శివ, మణిలకు తీవ్ర గాయాలవగాయ్యా పోలీసులు రాజంపేట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యంకోసం రాజంపేట నుంచి తిరుపతికి తరలించారు.

ప్రతిభకు పట్టం.. విజ్ఞాన్ మంథన్

విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు

దరఖాస్తు పరీక్షల వివరాలిలా	
దరఖాస్తు గడువు	సెప్టెంబర్ 30
పాఠశాల స్థాయి పరీక్ష	అక్టోబర్ 28 నుంచి 30వ తేదీ వరకు
జిల్లా స్థాయిలో	నవంబర్ 19వ తేదీన
జాతీయ స్థాయి పరీక్ష	2026 మే నెలలో


తరగతి గదిలో విద్యార్థులు

మదనపల్లె సిటీ : విద్యార్థుల్లో దాగిన ప్రతిభను, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణ వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహకాలు, దేశంలో సీఎస్ఐఆర్, ఐఎస్ఆర్‌వో, బార్క్, డీఆర్‌డీవో, ప్రముఖ జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను చూసే అవకాశం, ఇంటర్న్‌షిప్, ఉపకారవేతనం పొందే అవకాశాన్ని కలిగిస్తోంది.

కేంద్ర సంస్థల ఆధ్వర్యంలో..

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్, శాస్త్ర, సాంకేతిక విభాగం సంయుక్తంగా పరీక్ష నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో పరీక్ష పాల్గొనవచ్చు. ఆసక్తిగల విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్‌లో రూ.200 రుసుం చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి.

వివిధ స్థాయిల్లో పరీక్ష

వివిధ స్థాయిల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, గణితం, సామాన్యశాస్త్రం, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి, సత్యేంద్రనాథ్, బోస్ జీవిత చరిత్ర, లాజికల్ థింకింగ్, రీజనింగ్ తదితర సబ్జెక్టుల్లో బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నలుంటాయి. వీవీఎం పరీక్ష సంబంధించి విద్యార్థులు మొదట పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇంటర్నెట్ ద్వారా పరీక్ష రాయవచ్చు. విద్యార్థి ఇంటి నుంచే ఆన్‌లైన్ విధానంలో, సెల్‌ఫోన్, ట్యాబ్, డెస్క్‌టాప్, ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా పాల్గొనవచ్చు. ఆంగ్లం, హిందీతో పాటు 9 ప్రధాన ప్రాంతీయ భాషల్లో పరీక్షను నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు. ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థాయిని బట్టి ధ్రువపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారు.

ప్రధానోపాధ్యాయుల కృషి అవసరం



విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి కలిగించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు వీవీఎం పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– భాస్కరన్, డివిజన్ సైన్సు అధికారి, మదనపల్లె